నల్లమల్లలో పోడు రగడ

రైతులను అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమలలో పోడు వివాదం మళ్లీ రాజుకుంది. అటవీ శాఖ అధికారులు, పోడు రైతుల మధ్యన ఘర్షణ జరిగింది. కొన్నేండ్లుగా అక్కడ పోడు ఘర్షణ కొనసాగుతోంది.

మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది దళితులు తాటి చేలుక అడవి ప్రాంతంలో పోడు సాగు చేసేవారు. మూడేళ్లుగా అటవీశాఖ అధికారులు నిబంధనల పేరుతో వారిని సాగు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. దాంతో ఆ పొలాల్లో ఎవరూ సాగు చేయలేదు. అయితే, ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అటవీశాఖ అధికారులతో మాట్లాడి పోడు రైతులను సాగు చేసుకోనివ్వాలని చెప్పారు.

దాంతో తాటిచెలక ప్రాంతంలో సాగు చేసేందుకు వెళ్లిన రైతులను బుధవారం అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. అయితే తాటిచెలకలో ఎలాంటి సాగుకు అనుమతించేది లేదని అటవీశాఖ ఉన్నతాధికారులు తెగేసి చెప్పారు. అయినా.. ఇటీవల ఎమ్మెల్యే చెప్పారనే సమాచారంతో రైతులు సాగుకు సిద్ధపడటంతో అధికారులు అడ్డుకున్నారు. రాష్ట్రమంతా పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం తమను విస్మరించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగస్టు 15 నుంచి 'డబుల్' ఇళ్ల పంపిణీ

- మూడోసారి ముఖ్యమంత్రిగా కెసిఆరే
- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగస్టు 15 నుంచి డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ మొదలెట్టి అక్టోబర్‌లోగా లక్ష ఇళ్ల పంపిణీ పూర్తి చేస్తామని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అత్యంత ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని చెప్పారు. హైదరాబాద్ ఎల్‌బినగర్ నియోజకవర్గంలో జిఒ నెం.118 కింద రెగ్యులరైజ్ చేసి పట్టాలను బుధవారం వనస్థలిపురం జిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యను 118 జిఒతో పరిష్కరించినట్టు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి చాలా ఉందని చెప్పారు. దీని వల్ల 18 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇళ్లు ఇస్తామన్న హామీని నెరవేర్చుకుంటూపోతుంటే.. పనీ పాట లేని కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 15 నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీని ప్రారంభిస్తామని, అక్టోబర్‌లోపు లక్ష ఇళ్ల పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. సంక్షేమ కార్యక్రమాలే కాకుండా, శాశ్వత సమస్యల పరిష్కారంపై ముందుకు సాగుతున్నామన్నారు. కరోనా అనంతరం ప్రతి ప్రాంతంలో అత్యాధునిక ఆస్పత్రుల నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే.. వారిని ప్రజలు వదులుకోరని, రాష్ట్రానికి మూడో ముఖ్యమంత్రిగా కెసిఆర్ ఉంటారని చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాచకొండ సిపి డిఎస్ చౌహాన్, జిహెచ్ఎంసి కమిషనర్, డిసిపి సాయిశ్రీ, వనస్థలిపురం ఎపి భీమ్ రెడ్డి, వనస్థలిపురం సిఐ జలంధర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, బిఎన్‌రెడ్డి డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్

- సవరణ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ బుధవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. శుక్రవారం ప్రాథమిక సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకునే అవకాశముందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల ఐదున ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈనెల ఆరు వరకు వెబ్ఆప్షన్ల నమోదుకు అవకాశముందని వివరించారు. తొమ్మిదో తేదీ నాటికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. తొమ్మిది నుంచి 11 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సీట్ల రద్దుకు ఈ నెల 11న అవకాశముందని పేర్కొన్నారు. తొమ్మిది నుంచి 11 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఈ నెల 12 వరకు అభ్యర్థులు చేరిన వివరాలను కాలేజీలు అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఈనెల 17 నుంచి ప్రత్యేక విడత ఎంసెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 18న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. ఈనెల 17 నుంచి 19 వరకు వెబ్ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. 23 నాటికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 23 నుంచి 25 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు. 23న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తామని వివరించారు. https://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

టి శాట్ గ్రూప్-2 పాఠ్యాంశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 పోటీ పరీక్షల కోసం గురువారం నుంచి మరో మూడు గంటలపాటు అదనంగా పాఠ్యాంశాలను ప్రసారం చేయనున్నట్టు టీశాట్ సిఇఒ రాంపురం శైలేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల రోజులుగా ప్రతి రోజూ రెండు గంటలపాటు ప్రసారాలు అందించామని పేర్కొన్నారు. గురువారం నుంచి ఉదయం ఐదు నుంచి పది గంటల (అదనంగా మూడు గంటలు) వరకు ఛానళ్ల ప్రసారాలు కొనసాగిస్తాయని వివరించారు. నిపుణ ఛానల్‌లో సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ఇంగ్లీష్, జాగ్రఫీ, తెలంగాణ ఉద్యమం, చరిత్ర, ఎకానమి సబ్జెక్టులపై ప్రసారాలుంటాయని తెలిపారు. మరుసటి శుక్రవారం విద్య ఛానల్‌లో తెల్లవారుజామున ఐదు నుంచి పది గంటల వరకు పున్ణప్రసారాలుంటాయని పేర్కొన్నారు.

ఏడాది చివరి నాటికి జిఎస్‌టి ట్రిబ్యునల్ సాకారం

- హైదరాబాద్ సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్

హైదరాబాద్ : జిఎస్‌టి ట్రిబ్యునల్ ఈ ఏడాది చివరి నాటికి వాస్తవరూపం దాల్చనుందని హైదరాబాద్ జోన్ కస్టమ్స్, సెంట్రల్ టాక్స్ చీఫ్ కమీషనర్ సందీప్ ప్రకాష్ అన్నారు. 50వ జిఎస్‌టి కౌన్సిల్ సిఫార్సులపై ఎఫ్‌టిసిసిఐలో జరిగిన ఓ సమావేశంలో జిఎస్‌టి కన్సల్టెంట్లు, కార్పొరేట్‌ల బృందాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డిసెంబర్ నాటికి జిఎస్‌టి ట్రిబ్యునల్ పని చేస్తుందని, కనీసం కొన్ని బెంచ్‌లు పని చేయడం ప్రారంభిస్తాయన్న నమ్మకం తనకు ఉందన్నారు. నగరంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని కమిషనర్ గుర్తు చేసుకున్నారు. "నేను 1991లో సుమారు 32 సంవత్సరాల క్రితం ట్రైనీ ఆఫీసర్‌గా ఈ నగరానికి వచ్చాను. ఇప్పుడు నేను చీఫ్ కమిషనర్‌ని. అప్పటి నుండి నగరం చాలా



మారిపోయింది. నగరంతో నాకున్న అనుబంధాన్ని ఎంతో గౌరవిస్తాను." అని సందీప్ ప్రకాష్ అన్నారు. ఒకప్పుడు మనకు చాలా పన్నులు ఉండేవని, చాలా గందరగోళం ఉండేదని, ఆ పరిస్థితి అంతా ఇప్పుడు గతించిపోయిందని తెలిపారు.

వరద సాయం రూ.రెండు వేల కోట్లకు పెంచాలి

- బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి
- జాతీయ విపత్తు నిధులు విడుదలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల తర్వాత వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందాల పర్యటన సందర్భంగా వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వరద నష్టానికి క్యాబినెట్‌లో ప్రకటించిన రూ.500 కోట్లు ఏ మాత్రం సరిపోవనీ, రూ.రెండు వేల కోట్లకు పెంచాలని కోరారు. వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో వరదనష్టాన్ని అంచనా వేసి జాతీయ విపత్తు నిధులను విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో పదిరోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదలొచ్చిన ప్రాంతాల్లో తమ పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు గతనెల 29, 30 తేదీల్లో పర్యటించి, పలు అంశాలను పరిశీలించారని తెలిపారు. బాధితులతో మాట్లాడి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి జిల్లాల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, ములుగు జిల్లాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, డిజి నరసింహారావు, జనగామ జిల్లాలో అఖిల భారత నాయకులు హన్నన్‌మొల్ల, బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, భద్రాద్రి కొత్తగూడెంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు పర్యటించారని వివరించారు. ఆయా జిల్లాల కార్యదర్శులు, జిల్లా, స్థానిక నాయకత్వం కూడా ఈ పర్యటనలో పాలుపంచుకున్నదని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేసి ఆదుకున్నారని పేర్కొన్నారు. ఆయా బృందాల దృష్టికి వచ్చిన కొన్ని ముఖ్యమైన సమస్యలను సిఎం దృష్టికి తెస్తున్నామని తెలిపారు. సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటికోసం ఉద్దేశించిన భద్రకాళి చెరువుకు తూము లేనందున నీరు బయటకు వదిలే అవకాశం లేదని పేర్కొన్నారు. దానిపైన ఉన్న చెరువు తెగుతుందని అధికారులు ఆ నీటిని భద్రకాళి చెరువులోకి వదలడంతో కట్ట తెగిందని వివరించారు. ఈ చెరువుకు గేట్లు ఏర్పాటు చేస్తామంటూ 2020లో మంత్రి కెటిఆర్ తన పర్యటన సందర్భంగా వాగ్దానం చేసినా నేటికీ ఆ దిశగా ప్రయత్నమేమీ జరగలేదని తెలిపారు. వరంగల్ జిల్లాలో రూ.268 కోట్లు, హన్మకొండ జిల్లాలో రూ.206 కోట్లు మొత్తం రూ.474 కోట్లు వరద నష్టం జరిగినట్టు అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు ఏ ఒక్కచోట చేయకుండానే అంచనాలు వేశారని విమర్శించారు. ఈ నష్టం మరో నాలుగు రెట్లు ఉంటుందని తమ బృందం భావిస్తోందని పేర్కొన్నారు.

ఉబర్ అడ్డగోలు దోపిడి

- ఆ సంస్థ సిఇఒకు ఊహించని షాక్

వాషింగ్టన్ : ప్రముఖ క్యాబ్ అగ్రిగేటర్ ఉబర్ అడ్డగోలు దోపిడి మరోసారి బట్టబయలయ్యింది. ఈ అంశంలో ఆ కంపెనీ సిఇఒ ఖోస్రోషాహి అనుహ్యంగా ఇరుక్కుపోవడంతో.. ఉబర్ అబాసు పాలవుతోంది. మ్యాగజైన్ సంస్థ వైర్డ్ ఎడిటర్ స్టీవెన్ లెవీ ఉబర్ సిఇఒని ఇంటర్యూ చేసేందుకు ఉబర్ క్యాబ్‌ను బుక్ చేసుకున్నారు. ఆ క్యాబ్‌లో న్యూయార్క్‌లోని డౌన్‌టౌన్ సిటీ నుంచి నాలుగున్నర కిలోమీటర్ల దూరంలో వెస్ట్‌సైడ్ ఉబర్ ఆఫీస్‌కి వెళ్లారు. అక్కడే 2.95 మైళ్ల ఉబర్ రైడ్ ఛార్జీ ఎంత అయ్యింటుందో చెప్పాలని స్టీవెన్ లెవీ.. ఖోస్రాషాహిని అడిగారు. అందుకు ఉబర్ సిఇఒ ఇరవై డాలర్లు కావొచ్చని అన్నారు. కానీ అనూహ్యంగా డ్రైవర్ టిప్‌తో కలిపి ఉబర్ రైడ్‌కి 51.69 డాలర్లు (దాదాపు రూ.4,300) ఛార్జ్ చేశారని స్టీవెన్ లెవీ పేర్కొనడంతో ఉబర్ బాస్ ఖంగుతున్నారు. ఓరి దేవుడా అంటూ ఖోస్రోషాహి కొద్ది క్షణాల్లో షాక్ నుంచి తేరుకుని ఏదో వివరణ ఇచ్చే ప్రయత్నం చేయడం గమనార్హం. ఆ రైడ్‌కు కొన్ని నిమిషాల ముందు 20 డాలర్లు చూపించిందని.. ఆ తర్వాత సర్జ్ ప్రైస్ పేరిట భారీ మొత్తం పెరిగిందని.. ఈ సర్జ్ ప్రైస్‌కు అర్థం లేదంటూ ఖోస్రోషాషితో జర్నలిస్ట్ స్టీవెన్ అన్నారు.



గెలాక్సీ జడ్ ఫ్లిప్‌తో 50% మార్కెట్ వాటా లక్ష్యం

- సామ్‌సంగ్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ జడ్ ఫోల్డ్, జడ్ ఫ్లిప్5 విడుదలతో ప్రీమియం విభాగంలో 50 శాతం మార్కెట్ వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ఎంఎక్స్ బిజినెస్ అధ్యక్షుడు, హెడ్ టిఎం రోహ్ తెలిపారు. ఐదు తరాలుగా తమ సంస్థ సేకరించిన జ్ఞానం, అనుభవం ఆధారంగా అత్యంత వినూత్నమైన ఫోల్డబుల్ అనుభవాన్ని అందజేస్తున్నామని అన్నారు. వచ్చే కొన్నేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఫోల్డేబుల్ ఫోన్లకు ఏడా 10 కోట్ల యూనిట్లకు డిమాండ్ ఉండొచ్చన్నారు.

విలాసవంతమైన మైక్రో ఎల్ఇడి ఆవిష్కరణ

సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా విలాసవంతమైన 110 అంగుళాల పరిమాణంలో మైక్రో ఎల్ఇడి విడుదల చేసినట్లు ప్రకటించింది. దీని ధరను రూ.1,14,99,000గా నిర్ణయించింది. భారీ స్క్రీన్ సైజులో లభించే ఈ మైక్రో ఎల్ఇడి సంపూర్ణ శోభ, తదుపరిస్థాయి సాంకేతికతకు సూచికగా నిలుస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో ఇది లభిస్తుందని తెలిపింది.

శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

- వరద ప్రాంతాల పర్యటనలో గవర్నర్ తమిళి సై
- 'రెడ్ క్రాస్' ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఈ ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రభుత్వానికి సూచించనున్నట్టు రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ బుధవారం పర్యటించి పరిశీలించారు. ఉదయం 8:30 గంటలకు ఎన్ఐటికి చేరుకున్న గవర్నర్‌కు హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్‌డిఒలు రమేష్ కుమార్, వాసు చంద్ర స్వాగతం పలికారు. అలాగే, వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్, పాలకవర్గ సభ్యులు గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడి నుంచి శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వరంగల్, హన్మకొండలోని జవహర్ నగర్, నయీమ్ నగర్, భద్రకాళి బండ్, ఎన్‌టిఆర్ నగర్, ఎస్ఎన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద నష్టం వివరాలను గవర్నర్‌కు అధికారులు వివరించారు. భద్రకాళి చెరువు కట్ట మరమ్మతు పనులు, నయీమ్ నగర్ పెద్ద మోరి నాలాను పరిశీలించారు. ఎన్‌టిఆర్ నగర బృందావన కాలనీలో మోకాలు లోతు నీటిలో నడుస్తూ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ అందించిన హెల్త్ కిట్స్, నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవహర్ నగర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా పేరున్న వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకుల నిర్లక్ష్యమే నేడు ఈ నష్టానికి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వరంగల్, హన్మకొండ నగరాల్లో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, అక్కడి ప్రజలను ఆదుకునేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానిక రెడ్ క్రాస్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశానని తెలిపారు. అనేక ముంపు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరదలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా నగరాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని, తక్షణ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయమందేలా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, ఇవి శ్రీనివాస్, అధికారులు తదితరులు ఉన్నారు.



ముప్పు ప్రాంతాలను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళి సై

వరద సవాల్..!

- ఎమ్మెల్యేలకు ముంపు చిక్కులు
- శాశ్వత పరిష్కారానికి డిమాండ్
- మున్నేరుపై ఆర్‌సిసి వాల్ సాకారమేనా..?
- గోదావరి ముంపు ఊసేలేని క్యాబినెట్ భేటీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జులై 18 నుంచి మొదలైన వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. 27వ తేదీ నుంచి భారీగా వరదలు పోటెత్తడంతో ఖమ్మం జిల్లా మున్నేరు పరివాహక ప్రాంతం.. అటు కొత్తగూడెం జిల్లాలోని గోదావరి పరిసరాలు ముంపు బారిన పడిన విషయం తెలిసిందే. ఇటీవల క్యాబినెట్ భేటీలో ముంపు బాధితులకు తక్షణ సహాయార్థం రూ.500 కోట్లు కేటాయించింది. కానీ ఇవి ఏమేరకు సరిపోతాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గురువారం నిర్వహించే చిట్టచివరి అసెంబ్లీ సమావేశాల్లోనైనా ఉమ్మడి ఖమ్మం జిల్లా నదీ తీర ప్రాంత వాసుల సమస్యలు పరిష్కారం అవుతాయో.. లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి. ఈ సమావేశాల్లో ఏ మేరకు ముంపు ప్రాంత ఎమ్మెల్యేలు మాట్లాడతారు.. శాశ్వత పరిష్కారం చూపుతారు అనే ప్రశ్నలకు సమాధానం కోసం వరద బాధితులు ఎదురుచూస్తున్నారు.

వరదల నియంత్రణకు శాశ్వత పరిష్కారం లేదా..?

సాధారణంగా భద్రాచలానికి ఆగస్టులో భారీగా వరదలు పోటెత్తుతాయి. కానీ ఈ ఏడాది జూన్, జులైలోనే గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వానలతో వరదలు పోటెత్తాయి. పోలవరం ఎత్తు పెంచడం.. కాపర్ డ్యామ్ నిర్మాణంతో బ్యాక్‌వాటర్ భద్రాచలం వరకు ఎగపోటు వేస్తున్నా కేంద్ర జలమండలి, రాష్ట్ర ప్రభుత్వాలు దాని ప్రస్తావనే తేవడం లేదు. రెండు, మూడేండ్లుగా కొద్దిపాటి వర్షానికే భద్రాచలం జలమయం అవుతుండటం.. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో నీరు ప్రవహిస్తున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. భద్రాచలం వరదలకు కరకట్టల నిర్మాణం అసాధ్యమని జలసౌధలో మంగళవారం నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ చేసిన ప్రకటన వల్ల ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది వరదల సందర్భంగా భద్రాద్రిలో పర్యటించిన ముఖ్యమంత్రి కెసిఆర్ వరదల నియంత్రణ, భద్రాద్రి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానన్న హామీ అమలుకాలేదు. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలోనూ భద్రాచలం వరదల ఊసే ఎలేకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తంతో ఉన్నారు.

మున్నేరుకు అడ్డుగోడ సాకారమయ్యేనా..?

ఖమ్మం నగరానికి సరిహద్దున ఉన్న మున్నేరు పరివాహంలోనూ ఇటీవల వరదలు భారీగా పోటెత్తాయి. 2005లో ఎగువన బయ్యారం, పదుల సంఖ్యలో చెరువులకు గండ్లు పడటంతో ఉగ్రరూపం దాల్చిన మున్నేరు చేసిన నష్టానికన్నా ఈసారి రెట్టింపు స్థాయిలో ముంపు సంభవించింది. నగరానికి ఎగువన రెండు, మూడుచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించినా అవీ వరదలను నియంత్రించలేకపోయాయి. మున్నేరు ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో పైన ఏ చెరువుకూ గండిపడకపోయినా ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లోని మూడువేలకు పైగా ఇళ్లు జలమయమయ్యాయి. పదివేల మందికి పైగా ప్రజలు ముంపు బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన క్యాబినెట్ భేటీలో మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సిసి వాల్ మంజూరు చేస్తూ రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గతంలో పలుమార్లు కరకట్ట గురించి హామీ ఇచ్చినప్పటికీ అది కలగానే మిగిలింది. టిడిపి హయాంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడు కరకట్టలకు ప్రతిపాదనలు పంపించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ప్రతిపాదనలు వెళ్లాయి. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా మాజీ మంత్రి తుమ్మల, ప్రస్తుత మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సిఎం, కెటిఆర్‌లలో ఎవరు వచ్చినా కరకట్టల విషయం ప్రస్తావించారు. రెండేళ్ల క్రితం కార్పొరేషన్ ఎన్నికల ముందు మంత్రి కెటిఆర్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత వెంటనే రూ.146 కోట్లు కేటాయిస్తూ అనుమతులు జారీ చేశారు. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇలా మూడు దశాబ్దాలుగా మున్నేరుకు అడ్డుగోడ కలగానే మిగిలింది. ఇప్పుడు కూడా సాకారం అవుతుందో లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి.

మంత్రి, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి..
నున్నా నాగేశ్వరరావు, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి

అటు గోదావరి, ఇటు మున్నేరు కరకట్టల విషయంలో ఉమ్మడి జిల్లా మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, భద్రాచలం, పాలేరు ఎమ్మెల్యేలు పోడెం వీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి చొరవ చూపి కరకట్టలపై ఈ అసెంబ్లీ సమావేశాల్లో గట్టిగా మాట్లాడాలి. నష్టాల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ముంపు వాసులకు ప్రభుత్వం కేటాయించిన తక్షణ సహాయం రూ.500 కోట్లను మూడింతలు పెంచాలి.

హైకోర్టు ఆదేశాల మేరకైనా....
ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు చైర్మెన్‌ను నియమించాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

హైకోర్టు ఆదేశాల మేరకైనా.... ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు చైర్మెన్‌ను నియమించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 15 లోగా కమిషన్‌కు చైర్మెన్‌ను, సభ్యులను నియమించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా దళితులు, గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష పాటించిందనేందుకు హైకోర్టు తీర్పే నిదర్శనమని తెలిపారు. తల లేని మొండంలాగా పడి ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఇప్పటికైనా చైర్మెన్, సభ్యులను నియామించాలని వారు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 15లోగా నియమించాలనీ, లేదంటే దశల వారీగా ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఢిల్లీపై కేంద్రం ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆర్డినెన్సును తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం ఇటీవల ప్రతిపాదించిన జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ ప్రభుత్వం (సవరణ) బిల్లు-2023 గురించి తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు. దేశ పౌరుడిగా, రాజ్యాంగ విలువలను, సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకోవడం చాలా కీలకమని, అది ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని తాను నమ్ముతున్నానని తెలిపారు. ప్రతిపాదిత బిల్లు ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్‌సిటిడి)లో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను బలహీనపరుస్తూ, నగర ప్రభుత్వంలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు సంపూర్ణ నియంత్రణను మంజూరు చేయడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. ఈ చర్యను ఆమోదించడానికి అనుమతిస్తే ఎన్నికైన ప్రతినిధులకు ఇచ్చిన ప్రజాస్వామ్య ఆదేశాన్ని బలహీనపరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలకు కేంద్రం నిర్ణయం విరుద్ధమని విమర్శించారు.



ఉన్నత విద్యలో పెరిగిన మహిళల భాగస్వామ్యం : మంత్రి సబిత

- మహిళా విశ్వవిద్యాలయం లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉన్నత విద్యలో మహిళలు ముందంజలో ఉండేందుకు వీలుగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో రాష్ట్ర విద్యార్థుల కల సాకారమయ్యిందని, ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం మరింతగా పెరిగిందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె 'తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం' లోగో'ను విడుదల చేశారు. 'లోగో'ను రూపొందించిన అధికారులను మంత్రి అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని, వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బోధనా సౌకర్యాలు, విద్యార్థినులకు కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డి రవీందర్ యాదవ్, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజ్జులత తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని వారు మందులిస్తే జరిమానా

- డాక్టర్ సంజయ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ఫార్మసీ, మెడికల్ షాపుల్లో అర్హత లేని వ్యక్తులు, నకిలీలు ప్రజలకు మందులిస్తే అత్యధికంగా రూ.ఐదు లక్షలకుపైగా జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష పడుతుందని తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ సంజయ్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు లోక్ సభ ఆమోదించిన జన్ విశ్వాస్ బిల్లు ఫార్మసీ చట్టం 1948లోని సెక్షన్ 42 ఉల్లంఘిస్తే మూడు నెలల జైలు శిక్ష, రూ.రెండు లక్షల వరకు జరిమానా విధించవచ్చని తెలిపారు.

ఫార్మసీ యాక్ట్ 1948 ప్రకారం... ఫార్మసీల్లో ఫార్మసిస్టుల (ఔషధ నిపుణుల) ద్వారా మాత్రమే నాణ్యమైన మందులను తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. జన్ విశ్వాస్ బిల్లు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టంలోని 27డీ ప్రకారం... ఫార్మసీలు, మెడికల్ దుకాణాల్లో అర్హత లేని వ్యక్తులు, నకిలీలు ప్రజలకు మందులిస్తే రూ.ఐదు లక్షలు, అంతకన్నా ఎక్కువ జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

వెబ్ 3 ఆవిష్కరణ లక్ష్యంగా
టి -హబ్‌తో బ్రాడ్ రిడ్జ్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

వెబ్ 3 సాంకేతికత, ఆవిష్కరణలే లక్ష్యంగా టీ-హబ్‌తో బ్రాడ్ రిడ్జ్ ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ప్రముఖ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ సెంటర్, గ్లోబల్ ఫిన్‌టెక్ లీడర్ అయిన బ్రాడ్‌రిడ్జ్ ఒప్పందం ద్వారా తమ సహకారాన్ని ప్రకటించింది. దీంతో వ్యూహాత్మక భాగస్వామ్యం, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, విస్తృత వెబ్ 3 కమ్యూనిటీ మధ్య సహకారాలు, భాగస్వామ్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇరు సంస్థలు వెల్లడించాయి. వికేంద్రీకృత వెబ్ ల్యాండ్‌స్కేప్‌లో ఆవిష్కరణ, వృద్ధిని ముందుకుతీసుకుపోవడంతో ఉమ్మడి ప్రయత్నాలే కీలకం కానున్నాయి. వెబ్ 3 టెక్నాలజీలతో కార్పొరేట్‌ల నైపుణ్యం, అనుభవం, వనరులను ఉపయోగించుకునేలా స్టార్టప్‌లను శక్తివంతం చేస్తుంది. ఈ సందర్భంగా టీ-హబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, 'ప్రఖ్యాత గ్లోబల్ పవర్‌హౌస్ అయిన బ్రాడ్ రిడ్జ్‌తో చేతులు కలపడం మాకు గౌరవంగా ఉంది. ఈ రెండు సంస్థలు కలిసి వెబ్ 3 సాంకేతికత అపరిమితమైన సామర్థ్యాన్ని ఆసక్తిగా స్వీకరిస్తాం. మా స్టార్టప్‌లకు వారి ఆలోచనలను అపూర్వమైన ఎత్తులకు పెంచడానికి వినూత్న సాధనాలతో సాధికారత కల్పిస్తాం' అని అన్నారు. బ్రాడ్‌రిడ్జ్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ జర్మన్ సోటో సాంచెజ్ 'వెబ్ 3 స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చే బలమైన యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లను రూపొందించడంలో నిరూపితమైన ట్రాక్ రికార్డ్ ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ టీ-హబ్‌తో సహకరించడానికి మేము సంతోషిస్తున్నాం. వినూత్న స్టార్టప్‌లతో కలిసి పనిచేయడానికి, పర్యావరణ వ్యవస్థ వృద్ధికి సహాయపడటానికి ఇది మాకు గొప్ప అవకాశం. ఈ సహకారం ఆవిష్కరణలో ముందంజలో ఉండటానికి, మా కస్టమర్‌లకు సాధ్యమైనంత ఉత్తమమైన పరిష్కారాలను అందించడంలో మాకు సహాయపడుతుందని నమ్ముతున్నాం. వెబ్ 3 ప్రాముఖ్యతను, పరిశ్రమలను మార్చడానికి, వ్యాపారాలకు కొత్త అవకాశాలను సష్టించే సామర్థ్యాన్ని మేము గుర్తించాం' అని అన్నారు.

ఈ ఎమ్మెల్యే మాకొద్దు..

- రవీంద్రకుమార్‌కు వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకుల తీర్మానం
- దేవరకొండ అభ్యర్థిగా దేవేందర్ నాయక్ పేరు ప్రతిపాదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌పై సొంత పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేసిన తమను నిర్లక్ష్యం చేస్తూ.. ఇటీవల బిఆర్ఎస్‌లో చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ.. ఎన్నికల్లో రవీంద్రకుమార్‌కు ఓటేసే ప్రసక్తే లేదని డిండి మండల బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ దేవరకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా వడ్త్య దేవేందర్‌నాయక్ పేరును తీర్మానించారు. డిండి మండలం రుద్రాయిగూడెంలో బుధవారం దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మెన్ వడ్త్య దేవేందర్‌నాయక్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ వ్యవహార శైలి, పని తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టాన్ని కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు, అవమానాలకు గురిచేస్తున్నారన్నారు. సంస్థాగతంగా బిఆర్ఎస్‌కు భారీ మద్దతు ఉన్నా ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన పార్టీని అప్రతిష్టపాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధించాలంటే అభ్యర్థిని మార్చాల్సిన అవసరం ఉందని గుర్తించామన్నారు. ఈసారి అభ్యర్థిగా దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మెన్ దేవేందర్‌నాయక్ పేరును ప్రాతిపదించారు. లేనిపక్షంలో మండల నాయకులంతా తమ తమ అభిప్రాయాల మేరకు ఇతరదారులు వెతుక్కుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో దేవరకొండ మున్సిపల్ చైర్మెన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపిపి జానుయాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతపల్లి పుల్లయ్య, వావిల్‌కోల్ సర్పంచ్ డి దామోదర్‌రావు, డి రాఘవేంద్ర రావు, మాజీ ఎంపిటిసి డి యాదగిరిరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ భాస్కర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, గొనకొల్లు సింగిల్ విండో చైర్మెన్ వెంకటయ్య, ఖానాపూర్ సింగిల్‌విండో డైరెక్టర్ పి చంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రుణమాఫీ కాంగ్రెస్ విజయమే

- రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ విజయమని టిపిసిసి అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఉద్యమాలు, పోరాటాలు, ఒత్తిడి ఫలితంగానే సీఎం కేసీఆర్ రుణమాఫీ ప్రకటించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి రుణమాఫీ చేయాలని కోరినట్టు తెలిపారు. రుణమాఫీ అమలు చేయకపోతే, బ్యాంకుల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. కెసిఆర్ మెడలు వంచి రైతుల రుణమాఫీ సాధించామని తెలిపారు. కెసిఆర్ అసమర్థత వల్ల రుణమాఫీ నాలుగేళ్లు ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీపై అన్ని వడ్డీలతోసహా మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ అందేవరకు కాంగ్రెస్ రైతులకు అండగా ఉండి పోరాడుతోందని పేర్కొన్నారు.

ఆర్‌టిసి పై కెసిఆర్‌ది కపట ప్రేమ

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టీసిపై కెసిఆర్‌ది ఎన్నికల కపట ప్రేమ అని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఎద్దేవా చేశారు. ఆర్‌టిసి కార్మికులను మరోసారి మోసం చేసేందుకు విలీన ప్రకటన చేశారని ఆరోపించారు. ఆర్టీసి కార్మికులు తనకు వ్యతిరేకంగా ఉన్నారంటూ కెసిఆర్ హడావిడి ప్రకటన చేశారన్నారు. గతంలో ఆర్‌టిసి విలీనం సాధ్యం కాదన్నారు. విలీనం డిమాండ్ చేసే రాజకీయ పార్టీలకు ఏం తెలియదంటూ ఎద్దేవా చేసిన కెసిఆర్...ఇప్పుడు ఎన్నికల కోసం యు టర్న్ తీసుకున్నారని విమర్శించారు.

విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

- సోయంబాపూరావు కు బలరాంనాయక్ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి ఎంపి సోయంబాపూరావు మాటలు విద్వేషాలు రెచ్చగొట్టొదని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ హెచ్చరించారు. ఎస్‌టి నేతలు ఆయన మాటలు విని ఎంపికి అవగాహన లేదని మాట్లాడుకుంటున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులు కల్వ సుజాత, కృష్ణ తేజ, రవితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎంపిగా ఉండి గిరిజనులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లంబాడీ, కోయ కమ్యూనిటీ వేరు, వేరు కాదనీ, రాజ్యాంగ సవరణ చేసిన తర్వాత లంబాడీలను ఎస్‌టి జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. లంబాడీలకు రిజర్వేషన్ తొలగించడం సాధ్యం కాదన్నారు.

బాధితులు అభద్రతాభావానికి లోనుకావొద్దు

- కష్టసుఖాల్లో ఎల్లవేళలా అండగా సిపిఎం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితులు అభద్రతాభావానికి లోనుకావొద్దని, మీ కష్టసుఖాల్లో సిపిఎం అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హన్మకొండ పట్టణంలో ముంపునకు గురైన గుడిసెవాసులను పరామర్శించారు. వారికి సిపిఎం హన్మకొండ జిల్లా కార్యాలయంలో బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. జిల్లాలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక భూపోరాటాల్లోని చాలా మంది ఆశ్రయం కోల్పోయారన్నారు.

గుడిసెల్లోకి వరద నీరు వచ్చి బియ్యం, నిత్యావసర సరుకులు, బట్టలు తడిచి పూర్తిగా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బీభత్సం కారణంగా నగరం అతలాకుతలమై పలు కాలనీల్లో ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, వారందరినీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, కట్టలు మరమ్మతులు చేయాలని కోరారు. కాలువలు ఆక్రమించి నిర్మించిన వాటిని తొలగించాలని, భవిష్యత్తులో వరద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సూదర్శన్, జిల్లా కన్వీనర్ చక్రపాణి, జిల్లా నాయకులు ఎస్ వాసుదేవరెడ్డి, జి ప్రభాకర్ రెడ్డి, ఎం చుక్కయ్య, టి ఉప్పలయ్య, గొడుగు వెంకట్, మంద సంపత్, కె లింగయ్య, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంచుతున్న తమ్మినేని

గడి.. బడిలా కాకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించండి

- మాజీ ఎంపి బూరనర్సయ్యగౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గడి, బడి లెక్కకాకుండా అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని, కనీసం 15 రోజులపాటు అన్ని అంశాలపై సమగ్ర చర్చ నిర్వహించి ప్రతిపక్ష పార్టీల సభ్యులు మాట్లాడే అవకాశం కల్పించాలని బిజెపి నేత, మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంఖ్యాబలంగా కాకుండా సబ్జెక్టుపరంగా అసెంబ్లీలో చర్చ జరగాలని ఆకాంక్షించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.894 కోట్లలో 21 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతి ద్వారా ఈ నెల ఆరోతేదీన ప్రారంభించనున్నారని తెలిపారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం వెనుక లక్ష కోట్ల రూపాయల ఆస్తులను కొట్టేసే కుట్ర దాగిన ఉందని ఆరోపించారు. ఆ ఆస్తులను టచ్‌చేసే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కోడి బూరుపీకినట్లు తొమ్మిదేండ్లలో ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులతో ఆటలాడుకున్నారనీ, ఎగురలేని స్థితిలో గింజలు చల్లినట్టుగా ఎన్నికల ముందు వారికి ఎరవేస్తున్నారని చెప్పారు. ఆర్టీసీలో పనిచేసే కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని కోరారు. యాదాద్రి ఎంఎంటిఎస్‌కు వంద కోట్లు ఇచ్చేందుకే డబ్బులు లేవుగానీ హైదరాబాద్ చుట్టూతా మెట్రో విస్తరిస్తారంట అని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి హామీ లెక్క మెట్రో విస్తరణను చేయొద్దని సూచించారు. కెసిఆర్‌ను చూస్తుంటే ఆర్‌జివినే గుర్తుకు వస్తున్నారని చెప్పారు.

ఎక్కడికక్కడే ప్రాథమిక వైద్యం..!

- పెద్దాస్పత్రులపై తగ్గిన భారం
- గ్రేటర్ బస్తీ దవాఖానాలు, పిహెచ్‌సిలతో మార్పు
- 85 శాతం వరకు ఇక్కడే చికిత్సలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జ్వరం, దగ్గు, జలుబు లాంటి లక్షణాలు కనిపిస్తే చాలు గతంలో గాంధీ, ఉస్మానియా, ఫీవర్‌తోపాటు నగరంలోని పెద్దాస్పత్రులకు రోగులు పరుగులు పెట్టేవారు. గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో ఒపి సమయం సైతం అయిపోయి మరుసటి రోజు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. తీరా వైద్యుడిని కలిశాక టెస్టుల కోసం మరో రెండ్రోజులు ఆగాల్సి వచ్చేది. ఇదంతా గతం. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవంటున్నారు వైద్యాధికారులు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఒత్తిడి తగ్గిందని అంటున్నారు.

బస్తీ దవాఖానాల రాకతో ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రితోపాటు ఇతర పెద్దాస్పత్రులకు రోగుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుతం ఉస్మానియాలో 1500, ఫీవర్ హాస్పిటల్‌లో 500 వరకు ఒపి కొనసాగుతోంది. వర్షాకాలంలో ఈ రెండు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడేవి. ప్రస్తుతం బస్తీ దవాఖానాల రాకతో పరిస్థితి మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలకు రోగుల సంఖ్య పెరుగుతోంది. వాస్తవానికి పెద్దాస్పత్రుల్లో సర్జరీలు, ఇతర క్లిష్టమైన చికిత్సలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ రోగులు జ్వరానికీ పెద్దాస్పత్రులకు వెళ్తుండటంతో వాటిపై భారం పడుతోంది. ఫలితంగా సర్జరీలు, ఇతర సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని గుర్తించిన



వైద్య, ఆరోగ్యశాఖ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కంటోన్మెంట్‌తో కలిసి 283 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. దీంతో 80-85 శాతం వరకు ప్రాథమిక ఆరోగ్య సమస్యలకు ఇక్కడే చికిత్సలు లభిస్తున్నాయి.

వీటికితోడు హైదరాబాద్ జిల్లాలో 90 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు కమ్యూనిటీ సెంటర్లు, 47 పల్లె దవాఖానాలు, 12 పిహెచ్‌సిలు, 24 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 19 పట్టణ, 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. హైపటైటీస్, మధుమేహం, బిపి, థైరాయిడ్, జ్వరం, ఇతర సమస్యలకు ఈ హాస్పిటల్స్‌లోనే సేవలు అందుతున్నాయి. కార్డియాలజీ స్పెషలిస్టులు సైతం అందుబాటులో ఉన్నారు. టెలీ మెడిసిన్ ద్వారా ఉస్మానియా, గాంధీలోని వైద్య నిపుణులను ఇక్కడి నుంచే సంప్రదిస్తున్నారు. శస్త్ర చికిత్సలు, ఇతర అత్యవసర సమస్యలు ఉంటే పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

పరీక్షలు.. శాంపిళ్లు..

టెస్టుల కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉస్మానియా, గాంధీ లాంటి పెద్దాస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా 136 రకాల టెస్టులను ఈ కేంద్రాల్లోనే శాంపిళ్లు సేకరించి 24 గంటల్లో రిపోర్టు ఇస్తున్నారు. ఇలా నిత్యం దాదాపు 300కు పైగా కేంద్రాల నుంచి దాదాపు తొమ్మిది వేల శాంపిళ్ల వరకు నారాయణగూడ ఐపీఎంకు వస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో రేడియాలజీ సేవలూ ప్రవేశపెట్టారు. ఎక్స్, ఇసిజి, అల్ట్రాసౌండ్ తోపాటు ఎంఆర్ఐ, సీటీ స్కాన్ తదితర పరీక్షలను చేస్తున్నారు.

బస్తీ దవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలి
డాక్టర్ జె వెంకటి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్

బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలి. చిన్న చిన్న సమస్యలకు పెద్దాస్పత్రులకు వెళ్లకపోవడం మంచిది. తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో 24 గంటల్లోనే టెస్టుల ఫలితాలు వస్తాయి. రోగులకు ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు
డాక్టర్ రుక్మారెడ్డి, బస్తీ దవాఖానాల ఇన్‌చార్జి, హైదరాబాద్ జిల్లా

బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల ప్రాథమిక వైద్య సేవలు అందిస్తారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఏ చిన్న లక్షణం ఉన్నా వెంటనే దగ్గర్లోని బస్తీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి చికిత్స తీసుకోండి. నిర్లక్ష్యం చేయొద్దు.